ముగ్గుల పోటీలో పాల్గొన్న వివిధ పాఠశాలల విద్యార్థినులు

యువతకు స్వామి వివేకానంద ఆదర్శం

చేవెళ్ల సీఐ లక్ష్మారెడ్డి

చేవెళ్లటౌన్, జనవరి 11 : యువతకు స్వామి వివేకానంద ఆదర్శమని చేవెళ్ల సీఐ లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం చేవెళ్ల మండల కేంద్రంలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ చేవెళ్ల శాఖ ఆధ్వర్యంలో వివేకానందుడి జయంతిని పురస్కరించుకుని రంగోలి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత స్వామి వివేకానందను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో శంషాబాద్ విభాగ్ కన్వీనర్ సూర్యప్రకాశ్, చేవెళ్ల నగర కార్యదర్శి మహిపాల్, నందిని, మహేశ్, హరికృష్ణ, ప్రవీణ్, కార్తిక్ పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏవో జ్యోతిశ్రీ

మంచాల, జనవరి 11 : ఆయిల్‌పామ్ సాగుతో రైతులు అధిక దిగుబడితోపాటు లాభాలను ఆర్జించొచ్చని వ్యవసాయ శాఖ అధికారిణి జ్యోతిశ్రీ అన్నారు. గురువారం మండలంలోని ఆరుట్ల గ్రామపంచాయతీ ఆవరణలో ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జ్యోతిశ్రీ మాట్లాడుతూ రైతులు వరికి ప్రత్యామ్నాయంగా ఆయిల్‌పామ్ సాగు చేస్తే అధిక లాభాలను సాధిస్తారన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు రైతులు పాల్గొన్నారు.

మూగజీవాలను కాపాడాలి

పశువుకు గర్భకోశ వ్యాధి రాకుండా చికిత్స చేస్తున్న పశువైద్యాధికారిణి సుధ

మంచాల, జనవరి 11 : మూగజీవాల సంరక్షణకు రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మంచాల పశువైద్యాధికారిణి సుధ అన్నారు. గురువారం మండలంలోని చిత్తాపూర్, తిప్పాయిగూడ, జాపాల తదితర గ్రామాల్లో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పశువులకు గర్భకోశ వ్యాధులకు సంబంధించి చికిత్సలు నిర్వహించి రైతులకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి మాట్లాడుతూ పశువులకు ఎలాంటి వ్యాధులు సోకినా పశువైద్యాధికారిని సంప్రదించి చికిత్స పొందాలన్నారు. అనంతరం ఆవులు, పశువులకు ముందస్తుగా గర్భకోశ వ్యాధులు రాకుండా ఉండేందుకు మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు నాగరాజు గౌడ్, పశువైద్యాధికారులు సురేందర్, నాగమణి, కవితారాం చందర్, శ్రీశైలం పాల్గొన్నారు.

ఆధార్ సెంటర్ ఏర్పాటు చేయాలి

ఆమనగల్లు, జనవరి 11: నాలుగు మండలాల కూడలైన ఆమనగల్లులో శాశ్వత ఆధార్ సెంటర్ లేక ఆధార్ ఎన్‌రోల్‌మెంట్‌కు ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆమనగల్లు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సీఈవో దేవేందర్ పేర్కొన్నారు. ఈ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఆమనగల్లు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం భవనంలోనే శాశ్వత ఆధార్ సెంటర్‌కు అనుమతి ఇవ్వాలని ఆమనగల్లు తహసీల్దార్, రంగారెడ్డి కలెక్టర్, జిల్లా సహకార సంఘం అధికారికి వినతి పత్రం అందజేసినట్లు ఆయన తెలిపారు.

సెలవుల్లో సంతోషంగా గడపాలి..

- నేటి నుంచి ఆరు రోజులపాటు విద్యాసంస్థలకు సంక్రాంతి సెలవులు
- ఇప్పటికే వసతి గృహాల నుంచి ఇండ్లకు చేరుకుంటున్న విద్యార్థులు
- పుణ్యక్షేత్రాలు, చారిత్రక ప్రదేశాలను సందర్శించేందుకు ముందుగానే ప్లాన్
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్య నిపుణులు

షాబాద్, జనవరి 11 : సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రభుత్వం ఆరు రోజులపాటు విద్యాసంస్థలకు సెలవులు (ఈ నెల 12వ తేదీ నుంచి 17 వరకు) ప్రకటించింది. దీంతో రంగారెడ్డి జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకుల, బీసీ వెల్ఫేర్ పాఠశాలలు, కళాశాలలు, కేజీబీవీ పాఠశాలల విద్యార్థులు బ్యాగులు సర్దుకుని తమ ఇండ్లకు వెళ్తున్నారు. కొంతమంది విద్యార్థులు తమ తల్లిదండ్రులతో కలిసి ఈ సెలవుల్లో పుణ్యక్షేత్రాలు, చారిత్రక ప్రదేశాలను సందర్శించేందుకు సిద్ధమవుతున్నారు. ఇందుకోసం ముందస్తుగానే ప్రణాళికను వేసుకున్నారు. దూర ప్రాంతాల పర్యటనలు జీవితంలో మధుర ఘట్టాలుగా మిగిలిపోతాయి. అందులోనూ గ్రూపులుగా వెళ్తే ప్రతిచోటా సందడే. అటువంటి ప్రయాణాలు విషాదయాత్రలుగా మారకుండా ఉండాలంటే కచ్చితంగా జాగ్రత్తలు తీసుకోవాల్సిందే.

ముందస్తు ప్లానింగ్ అవసరం..

చక్కటి ప్లానింగ్‌తో వెళ్తే ప్రయాణాలు ఎంతో సంతోషంగా ఉంటాయి. పర్యటనలో చూసే ప్రదేశాల గురించి ముందుగానే అవగాహన పెంచుకోవాలి. సాధ్యమైనంత వరకు ఒకే రూట్‌లో ఉన్న ప్రదేశాలను ఎంపిక చేసుకోవాలి. పర్యటించే ప్రదేశాల్లో వాతావరణ పరిస్థితి, గైడ్, భోజనం, తదితర వివరాలను తెలుసుకోవాలి. వెబ్‌సైట్ల ద్వారా కూడా మనం పర్యటించే ప్రదేశాల వివరాలను తెలుసుకోవచ్చు.

చేవెళ్లటౌన్: బ్యాగులతో చేవెళ్ల బస్టాండ్‌కు వెళ్తున్న విద్యార్థులు

విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- ఎవరికి వారు వ్యక్తిగతంగా మెడికల్ కిట్లు దగ్గర పెట్టుకోవాలి. రోజూ వాడే మందులు ఎక్కువగా తీసుకెళ్లాలి. సముద్ర తీర ప్రాంతాలకు వెళ్లేవారు అక్కడి వాతావరణ పరిస్థితులకు అవసరమైన మందులు తీసుకెళ్తే మంచిది.
- ప్రయాణాల్లో సాధ్యమైనంత వరకు మినరల్ వాటర్, బిస్కెట్లు, పండ్లు తీసుకోవడం మంచిది. వేడి పదార్థాలు తినేందుకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఇతర ప్రాంతాల వంటలు రుచిగా ఉన్నప్పటికీ మితంగా తినడం వల్ల ప్రయాణాల్లో అనారోగ్యానికి గురికాకుండా ఉంటారని వైద్యులు సూచిస్తున్నారు.
- పర్యటనలో అనుకోని ఇబ్బందులు, సమస్యలు ఎదురైతే పర్యటన వాయిదా వేసుకునేందుకూ వెనుకాడొద్దు. దూర ప్రాంతానికి వచ్చామనే ఉద్దేశ్యంతో ముందుకెళ్తే సమస్య మరింత జటిలం అవుతుంది.

- కొన్ని ప్రదేశాలకు వెళ్లినప్పుడు ఒంటెలు, గుర్రాలపై ప్రయాణం చేయాల్సి ఉంటుంది. వాటి వివరాలు, అయ్యే ఖర్చులపై అవగాహన ఉండాలి.
- ప్రయాణాల్లో సెల్‌ఫోన్‌ను జాగ్రత్తగా ఉపయోగించుకోవాలి. ప్రమాదాల్లో చిక్కుకున్నప్పుడు ఇంట్లో వారితో క్లుప్తంగా మాట్లాడి, సాధ్యమైనంత వరకు తెలిసిన అధికారులకు తాము ఎదుర్కొంటున్న ప్రమాద వివరాలను తెలియజేస్తే రక్షించే అవకాశం ఉంటుంది.
- ప్రమాదంలో అనుకొని ప్రమాదం ఎదురైతే కంగారు పడకుండా గుండె ధైర్యంతో ఆ సమస్య నుంచి బయటపడేందుకు ప్రయత్నించాలి. ఎదుటి వారితో సహాయం తీసుకునేందుకు మొహమాటపడొద్దు.
- గ్రూపులుగా వెళ్లినప్పుడు తప్పిపోతే తిరిగి ఎక్కడ కలవాలో ముందుగానే నిర్ణయించుకోవాలి. అందరూ సులభంగా గుర్తించే ప్రదేశాన్ని ఎంపిక చేసుకుని అక్కడ తిరిగి కలిస్తే ఇబ్బంది ఉండదు.
- ప్రయాణాల్లో ముఖ్యంగా అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలి.

పరీక్షలు చేసి.. మందులు పంపిణీ చేసి..

మండలంలోని పలు గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాల నిర్వహణ

చిన్నరావిరాలలో ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు

అబ్దుల్లాపూర్‌మెట్, జనవరి 11 : వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా మండలంలోని చిన్నరావిరాల గ్రామంలో గురువారం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్యాధికారులు ప్రజలకు పలు రకాల ప్రాథమిక పరీక్షలు చేసి మందులు అందజేశారు. అనంతరం వ్యవసాయదారులకు డ్రోన్ ద్వారా రసాయనాలను పిచికారీ చేసే విధానంపై అవగాహన కల్పించారు. ఈ పనిముట్లను కొనుగోలు చేస్తే బ్యాంకు ద్వారా రుణ సదుపాయం కల్పిస్తామని మేనేజర్ ప్రదీప్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ వనజాశ్రీనివాస్‌రెడ్డి, ఉపసర్పంచ్ శేఖర్‌రెడ్డి, వార్డు సభ్యులు జంగం, బాల్‌రెడ్డి, భాస్కర్, వైద్యాధికారులు శ్రేయ, సంతోషి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, ఏఎన్ఎం మంజుల, ఆశ వర్కర్లు, రైతులు పాల్గొన్నారు.

బలిజగూడలో..

వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా సెంట్రల్ బ్యాంక్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం మధ్యాహ్నం బలిజగూడ గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. వైద్యులు పలువురికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వీరస్వామిగౌడ్, ఉపసర్పంచ్ సురేశ్, సీబీఐ బ్యాంక్ మేనేజర్ ఉషాకిరణ్, నాయకులు పాపయ్య గౌడ్, విష్ణుగౌడ్, వెంకటేశ్, వీరేశం, రాధిక తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు సమాచారమివ్వండి

- పండుగకు ఊరెళ్లే వారు స్థానిక పీఎస్‌లో చెప్పండి
- చోరీల నివారణకు గస్తీని పెంచుతాం
- అబ్దుల్లాపూర్‌మెట్ సీఐ మన్మోహన్‌యాదవ్

పెద్దఅంబర్‌పేట, జనవరి 11 : పండుగొచ్చిందంటే.. ఎవరికైనా సంతోషమే. సొంతూరుకు పోతున్నామనే ఆనందమే వేరు. కానీ, అదే సమయంలో ఇంటికి తాళం వేసి అడుగు బయట పెట్టాలంటే ఏదో ఓ మూలన దొంగల భయమూ వెంటాడుతున్నది. ఇంట్లో మనుషుల అలజడి లేకపోయినా, గేటు, ఇంటికి తాళం వేసి ఉన్నా.. దొంగలు కన్నేసే ప్రమాదం ఉన్నదని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఊరికి వెళ్లే ముందు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. ఇరుగు పొరుగు వారితో ఫ్రెండ్లీగా ఉండాలని, బయటికి వెళ్లాల్సి వచ్చినప్పుడు వారి చెవిలో ఓ మాట వేయడం మరిచిపోవొద్దని అంటున్నారు. మీకు ఎవరిమీదైనా అనుమానం వస్తే 100 టోల్ ఫ్రీనంబర్‌కు లేదా పోలీస్ కంట్రోల్ రూం 8712662666 నంబర్‌కు .. 8712662111 వాట్సాప్ నంబర్‌కు గానీ సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరుతున్నారు.

సీసీ కెమెరాలతో భద్రత

సంక్రాంతి పండుగకు పాఠశాలలకు ప్రభుత్వం సెలవులు ప్రకటించడంతో చాలామంది ఇంటిళ్లిపాదితో కలిసి సొంతూళ్లకు వెళ్తుంటారు. ఈ సమయంలో ఇండ్లకు తాళాలు వేసి వెళ్లాల్సి వస్తుంది. అందువల్ల విలువైన వస్తువులు, నగదు, ఆభరణాలను ఇంట్లో ఉంచకుండా బ్యాంకు లాకర్లలో దాచడమే ఉత్తమం. ఇంటికి, వీధికి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా సగం చోరీలను నివారించొచ్చు. అదేవిధంగా ఊరికి వెళ్లే సమయంలో ఇంటి పక్కవారితోపాటు పోలీసులకు కూడా సమాచారం ఇస్తే గస్తీ ఏర్పాటుచేస్తాం. దొంగతనాలు ఎక్కువగా జరిగే గ్రామాలపై మరింత దృష్టి సారిస్తాం.

- మన్మోహన్‌యాదవ్, సీఐ, అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్

విలువైన వస్తువులు ఇంట్లో వద్దు

- ఊరికి వెళ్లే సమయంలో వీలైనంత మేరకు ఇంటిలో విలువైన వస్తువులు, నగదు పెట్టొద్దు. వాటిని బ్యాంకు లాకర్లు లేదా భద్రంగా ఉన్న చోట దాచుకోవడం మంచిది.
- ఇంటి ముందు తలుపులకు సెంటర్ లాక్ చేసి బయట గొళ్లెం పెట్టకండి.
- ఇంటి తలుపుల ముందు చెప్పులు ఉంచండి.
- బయట గేటుకు లోపలి నుంచి తాళం వేయండి.
- ఇంట్లోని ముందు గదిలో లైట్లు వేసి ఉంచండి.
- పేపర్‌బాయ్, పాలు పోసేవాళ్లకు రావొద్దని ముందే చెప్పండి.
- ఊరికి వెళ్లే సమయంలో మీకు నమ్మకమైన వారికి, స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వండి.
- బయటికి వెళ్లే సమయంలో, ఇంటి బయట ముగ్గులు వేసే సమయంలోనూ మెడలోని బంగారు ఆభరణాలను జాగ్రత్తగా చూసుకోండి.
- ఇంట్లో, కాలనీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుచేసుకోండి.
- ఇంటికి తాళం వేసి వెళ్లేటప్పుడు తాళం కనిపించకుండా డోర్ కర్టెన్‌వేసి వెళ్లండి.

అసెంబ్లీ స్పీకర్‌కు

ఘన సన్మానం

వికారాబాద్ జడ్పీ సర్వసభ్య సమావేశం గురువారం వికారాబాద్ డీపీఆర్‌సీ మద్గుల్ చిట్టంపల్లిలోని భవనంలో జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి అధ్యక్షతన జరిగింది. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు ఘన స్వాగతం పలికారు. సమావేశం అనంతరం జిల్లాలోని ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పూలమాలలు, శాలువాలతో ఆయన్ను ఘనంగా సన్మానించారు.

-వికారాబాద్, జనవరి 11

క్రీడలతో మానసికోల్లాసం

క్రికెట్ టోర్నీని ప్రారంభిస్తున్న నాయకులు

ఆమనగల్లు, జనవరి 11 : క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని ఆమనగల్లు మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, బీఆర్ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు నేనావత్ పత్యానాయక్ అన్నారు. మున్సిపాలిటీలోని మూడోవార్డు పరిధిలోని అన్ని తండాలు కలిసి ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నీని గురువారం వారు ప్రారంభించి మాట్లాడారు. చిన్నతనం నుంచే ప్రతి ఒక్కరూ క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి కృష్ణా నాయక్, టోర్నమెంట్ ఆర్గనైజర్లు సంతోష్, కిషన్, నాయకులు రఘూనాయక్, కుమార్, శంకర్, సీతారం, రాజేశ్, రమేశ్, జైపాల్, నరేందర్ పాల్గొన్నారు.

కొడంగల్ పట్టణ సుందరీకరణపై నజర్

అధికారులతో సమావేశమైన వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, జనవరి 11 : కొడంగల్ మున్సిపాలిటీతో పాటు నియోజకవర్గాభివృద్ధికి అధికారులు చర్యలు చేపట్టాలని వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో కొడంగల్ పట్టణ సుందరీకరణపై ఆయన ఎన్‌సీపీఈ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇండియా (పీ) లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ సుభానితో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా చేపట్టాల్సిన పనులను పరిశీలించారు. కొడంగల్ మున్సిపల్ పరిధిలో పార్కులు, పక్కా సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు, అంబేద్కర్ జంక్షన్, చెరువుకట్ట అభివృద్ధితోపాటు చెరువు వద్ద బతుకమ్మఘాట్, నిమజ్జనం, డంపింగ్ యార్డు, క్రిమిటోరియం, క్రీడాప్రాంగణం, సెంట్రల్ లైటింగ్ తదితర అంశాలపై చర్చించారు. అవసరమైన నిధుల గురించి సంబంధిత అధికారులతో మాట్లాడుతానన్నారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు రాహుల్‌శర్మ, లింగ్యానాయక్, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ నారాయణఅమిత్, కొడంగల్, వికారాబాద్ మున్సిపల్ కమిషనర్లు ప్రవీణ్‌కుమార్, జాకీర్‌అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

621 ఎకరాల్లో పచ్చి మిర్చి సాగు

వికారాబాద్ జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి చక్రపాణి

వికారాబాద్, జనవరి 11 : వికారాబాద్ జిల్లాలో రబీ సీజన్‌లో పచ్చిమిర్చి 621 ఎకరాల్లో సాగులో ఉన్నదని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖ అధికారి చక్రపాణి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పరిగి నియోజకవర్గంలోని పరిగి, పూడూరు మండలాల్లో, వికారాబాద్ సెగ్మెంట్‌లోని మర్పల్లి, మోమిన్‌పేట, నవాబుపేట మండలాల్లో మిర్చి పంట సాగు అధికంగా ఉన్నదన్నారు. గత రెండు దశాబ్దాలుగా మిర్చి పంటకు కొత్త రకం తామర పురుగులు నష్టం కలిగిస్తున్నయన్నారు. ఈ పురుగులు ప్రధానంగా పూలు, ఆకుల అడుగు భాగంలో గుంపులుగా ఆశించి.. లార్వా ఆకుల దిగువ నుంచి రసాన్ని పీలుస్తాయన్నారు. అప్పుడు పూత అధికంగా రాలి కాయ ఉత్పత్తి తగ్గుతుందన్నారు. దీని నివారణకు సమీకృత యాజమాన్య పద్ధతి, పంటల సీజన్‌ను ముందుకు తీసుకెళ్లడం ద్వారా పూత సమయంలో ఈ తామర పురుగులు ఆశించకుండా కాపాడుకోవచ్చని వివరించారు. ఈ పురుగును తట్టుకునేందుకు అందుబాటులో ఉన్న రకాలు, స్వల్ప కాల వ్యవధి గల రకాలను సాగు చేయాలన్నారు.

సీఐతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొత్తూరులోని ఓ పాన్‌షాపులో పోలీసుల తనిఖీ

డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం

- మూడు రోజుల్లో కొత్తూరులో మత్తు పదార్థాలు లేకుండా చేస్తాం
- కొత్తూరు జడ్పీహెచ్ఎస్‌ను సందర్శించిన షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్

కొత్తూరు, జనవరి 11: కొత్తూరు పట్టణంలో మత్తు పదార్థాలు కనిపించకుండా మూడు రోజుల్లో చర్యలు తీసుకుంటామని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. గంజాయితో తయారు చేసిన చాక్లెట్లను సరఫరా చేస్తున్న వారిని పోలీసులు పట్టుకున్న నేపథ్యంలో గురువారం ఆయన కొత్తూరు జడ్పీహెచ్ఎస్‌ను సందర్శించి విద్యార్థులు, ప్రధానోపాధ్యాయుడుతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో డ్రగ్స్ నివారణకు ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటున్నదన్నారు. విద్యార్థుల పట్ల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కొత్తూరులో విస్తృత తనిఖీలు నిర్వహించి మత్తు పదార్థం అనేదే లేకుండా చర్యలు చేపడుతామన్నారు.

జడ్పీహెచ్ఎస్‌ను సందర్శించిన డీఈవో, డీఎంహెచ్‌వో

కొత్తూరు జడ్పీహెచ్ఎస్‌ను గురువారం ఉదయం డీఈవో సుశీందర్‌రావు, డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు, డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయలక్ష్మి సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసి బలహీనంగా ఉన్న విద్యార్థులను పరిశీలించారు. పాఠశాలకు మానసిక వైద్యురాలిని కూడా పిలిపించారు. అయితే విద్యార్థులు ఎవరు కూడా వీక్‌గా కనిపించలేదని హెడ్‌మాస్టర్ అంగూర్‌నాయక్ తెలిపారు.

పోలీసుల విస్తృత తనిఖీలు

మత్తు పదార్థాలపై కొత్తూరు పోలీసులు యుద్ధం ప్రకటించారు. గురువారం సాయంత్రం విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. మున్సిపాలిటీలోని అన్ని పాన్ షాపులు, కిరాణా దుకాణాలను జల్లెడపట్టారు. బుధవారం పెద్ద మొత్తంలో గంజాయితో తయారు చేసిన చాక్లెట్లు దొరకడంతో పోలీసులు అలర్ట్ అయ్యారు. పట్టణంలో అనుమానం వచ్చిన ప్రతిచోటునూ కుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కొత్తూరు సీఐ నరసింహారావు మాట్లాడుతూ మత్తు పదార్థాలు అమ్మినా, సేవించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. శుక్రవారం నుంచి కంపెనీల్లో కూడా తనిఖీలు చేపడుతామని చెప్పారు. మత్తు పదార్థాలపై ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. తనిఖీల్లో ఎస్ఐలు శ్రీనివాస్, జి. శ్రీనివాస్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తుల ఎంట్రీ

గడువులోగా పూర్తి కావాలి

- రంగారెడ్డి కలెక్టర్ శశాంక
- మున్సిపల్ కమిషనర్లతో సమీక్ష

ఇబ్రహీంపట్నం, జనవరి 11: ప్రజాపాలన దరఖాస్తుల డాటా ఎంట్రీని నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని రంగారెడ్డి కలెక్టర్ శశాంక అన్నారు. ప్రజాపాలన దరఖాస్తుల కంప్యూటరీకరణపై గురువారం ఆయన మున్సిపల్ కమిషనర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డిసెంబర్ 28 నుంచి జనవరి 6 వరకు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో స్వీకరించిన ప్రజాపాలన దరఖాస్తులను ప్రజాపాలన పోర్టల్‌లో ఎంట్రీపై మున్సిపల్ కమిషనర్లు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల నుంచి ఐదు లక్షల వరకు దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు. తప్పులేకుండా ఆ దరఖాస్తులను ఎంట్రీ చేయాలని ఆపరేటర్లకు సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, జడ్పీ సీఈవో దిలీప్‌కుమార్, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి ప్రభాకర్, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ప్రత్యేక అధికారులు, నోడల్ అధికారులు పాల్గొన్నారు.